నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
19వ వసంతంలోకి..

EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
బుధవారం
29-10-2025
పేజీలు: 02

### తప్పుడు కేసుల్లో శిక్ష అనుభవించిన నిర్దోషులకు నష్టపరిహారం ఈ అంశంపై

# సుప్రీంకోర్టు కీలక పరిశీలన

తప్పుడు అభియోగాలతో అన్యాయంగా జైలు శిక్ష అనుభవించిన నిర్దోషులకు నష్టపరిహారం చెల్లించే అంశంపై సుప్రీంకోర్టు తీవ్రంగా దృష్టి సారించింది. వ్యవస్థ తప్పిదాల వల్ల బలిపశువుగా మారిన వ్యక్తి, విలువైన జీవితాన్ని కోల్పోయినప్పుడు పరిహారం అందించేందుకు ఒక పటిష్ఠమైన విధానాన్ని రూపొందించే అవకాశాలను పరిశీలిస్తోంది. ఈ ప్రక్రియలో ఉన్న చట్టపరమైన సంక్లిష్టతలను అధిగమించేందుకు తమకు సహాయం చేయాల్సిందిగా అటార్నీ జనరల్, సొలిసిటర్ జనరల్‌లను కోరింది. జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాలతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.మైనర్ బాలికపై అత్యాచారం, హత్య కేసులో తప్పుడు ఆరోపణలతో 12 ఏళ్లు జైలు జీవితం గడిపిన ఓ నిరుపేద వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ అంశం చర్చకు వచ్చింది. ఈ కేసులో థానే కోర్టు అతనికి 2019లో మరణశిక్ష విధించింది. అయితే, సుదీర్ఘ విచారణ అనంతరం సుప్రీంకోర్టు అతన్ని నిర్దోషిగా తేల్చి ఇటీవల విడుదల చేసింది. ఈ నేపథ్యంలో తాను కోల్పోయిన 12 ఏళ్ల జీవితానికి పరిహారం ఇప్పించాలని కోరుతూ బాధితుడు సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు.బాధితుడి తరఫున సీనియర్ న్యాయవాది గోపాల్ సుబ్రహ్మణ్యం వాదనలు వినిపించారు. "ఇలాంటి కేసుల్లో బాధితులకు నష్టపరిహారం చెల్లించాల్సిన అవసరం ఉంది. జైలు జీవితం వారి ప్రాథమిక హక్కులను కాలరాయడమే. దీనిపై కోర్టు స్పష్టమైన మార్గదర్శకాలు రూపొందించాలి" అని ఆయన కోరారు. ఈ అంశంపై ఒక స్థిరమైన ఏర్పాటు అవసరమని గతంలో లా కమిషన్ కూడా సిఫార్సు చేసిందని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు.ఈ సందర్భంగా ధర్మాసనం దేశంలో శిక్షలు పడుతున్న కేసుల శాతం కేవలం 54గా ఉండటాన్ని గుర్తుచేసింది. తప్పుడు సాక్ష్యాలు సృష్టించడం లేదా వ్యవస్థ బాధితుడిని బలిపశువును చేయడం



వంటి సందర్భాల్లో పరిహారం అంశాన్ని పరిగణించాలని భావిస్తున్నట్లు ధర్మాసనం సూచనప్రాయంగా తెలిపింది.ఇదే ధర్మాసనం, మానసిక వైద్య చట్టం-2017 అమలుపై దాఖలైన మరో ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని జాతీయ మానవ హక్కుల కమిషన్ కి బదిలీ చేసింది.



## తుఫాన్ తర్వాత కూడా అప్రమత్తంగా ఉండాలి

'మొంథా' తుఫాన్ తీరం దాటిన తర్వాత కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. సమస్య ఉందనుకున్న ప్రాంతాల్లో అధికారులు, ప్రజాప్రతినిధులు ఉండాలని స్పష్టం చేశారు. క్షేత్ర స్థాయిలో ప్రజాప్రతినిధులు ఉంటే.. ప్రజలకు భరోసా ఇచ్చినట్లవుతుందని చెప్పారు. మంగళవారం అర్ధరాత్రి వరకు ఆయన అమరావతి సచివాలయంలోనే ఉండి విరామం లేకుండా వరుస సమీక్షలు జరిపారు. ఆర్‌టీజీఎస్ నుంచి మూడు సార్లు సమీక్షలు చేసిన ఆయన.. రెండు సార్లు కలెక్టర్లు, అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లు జరిపారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా పాల్గొన్నారు. తుఫాన్ కారణంగా ప్రాణ నష్టం లేకుండా, ఆస్తి నష్టం ఎక్కువ జరగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని సీఎం చెప్పారు.ఆర్‌టీజీఎస్‌కు వచ్చిన సమాచారాన్ని విశ్లేషించి, రియల్ టైమ్‌లో సమస్యల పరిష్కారానికి.. అంటే గాలికి పడిపోయిన చెట్ల తొలగింపు, సబ్‌స్టేషన్లలో సమస్యలను తక్షణం పరిష్కరించేలా ఆయన చర్యలు చేపట్టారు. వర్ష ప్రభావిత జిల్లాల్లో సహాయ చర్యలపై మంత్రులు, అధికారులతో ఎప్పటికప్పుడు మాట్లాడుతూ సూచనలు చేశారు. పునరావాస కేంద్రాల్లో పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలకు వెళ్లిన మంత్రులు, ప్రత్యేక అధికారులతో నిరంతరం చర్చిస్తూ వచ్చారు.

## బ్రెజిల్‌లో డ్రగ్ ముఠాలపై దాడులు.. 64 మంది మృతి

రియో డి జనైరోలో రక్తం ఏరులై పారింది. డ్రగ్ దందా నిర్వహిస్తున్న ముఠాలపై బ్రెజిల్ పోలీసులు విరుచుకుపడ్డారు. దీంతో రియో పట్టణంలోని ఉత్తర ప్రాంతం వణికిపోయింది. సుమారు 64 మంది ప్రాణాలు కోల్పోయింది. దాదాపు 2500 మంది భద్రతా సిబ్బంది.. డ్రగ్ ట్రాఫికింగ్ ముఠాలపై రెయిడ్స్ నిర్వహించారు. సాయుధ వాహనాలు, హెలికాప్టర్లు, డ్రోన్లతో పోలీసులు ఆ ఆపరేషన్ నిర్వమించారు. నార్తర్న్ బ్రెజిల్‌లో ఉన్న రెండు మురికివాడల్లో ఆ తనిఖీలు నిర్వహించారు. రియో ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్టు సమీపంలో గన్‌ఫైర్ శబ్ధాలు వినిపించాయి. అనేక ప్రాంతాల నుంచి నల్లటి పొగ కమ్ముకున్నది. డ్రగ్ ముఠాలకు చెందిన బృందాలతో డ్రోన్లతో ప్రతిదాడులకు దిగినట్లు పోలీసులు ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలోనే ఇది అతిపెద్ద ఆపరేషన్ అని గవర్నర్ క్లాడియో క్యాస్ట్రో తెలిపారు. వివిధ గ్యాంగ్‌లకు చెందిన సుమారు 60 మంది అనుమానాస్పద రీతిలో మృతిచెందినట్లు క్యాస్ట్రో వెల్లడించారు. డ్రగ్ రెయిడ్‌లో నలుగురు పోలీసు ఆఫీసర్లు కూడా ప్రాణాలు కోల్పోయారు.




### దేవీశ్రీ ప్రసాద్‌కి జోడీగా

# కీర్తి సురేశ్!

తెలుగు సినీప్రేక్షకుల మనసుల్లో ఎనర్జీతో నిండిన మ్యూజిక్ డైరెక్టర్‌గా పేరు తెచ్చుకున్న రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ ఇప్పుడు మరో కొత్త అవతారానికి సిద్ధమవుతున్నారు. దాదాపు రెండు దశాబ్దాలుగా తన సంగీతంతో కోట్లాది మంది అభిమానులను అలరించిన ఈ స్టార్ కంపోజర్ ఇప్పుడు నటుడిగా ఎంట్రీ ఇవ్వబోతున్నారు. 'బలగం' ఫేం వేణు యెల్దండి దర్శకత్వంలో తెరకెక్కనున్న ' ఎల్లమ్మ ' ద్వారా దేవిశ్రీ ప్రసాద్ హీరోగా పరిచయం కానున్నారు. ఈ సినిమా గురించి ఫిలింనగర్ వర్గాల్లో ఇప్పటికే చర్చలు ఊపందుకున్నాయి. ప్రముఖ నిర్మాత దిల్‌రాజు ఈ చిత్రాన్ని భారీ స్థాయిలో నిర్మించనున్నారు. కథ, పాత్ర, భావోద్వేగాల పరంగా పూర్తి భిన్నమైన కథాంశంతో 'ఎల్లమ్మ' రూపొందనుందని సమాచారం. వేణు ఎల్దండి తన తొలి చిత్రమైన 'బలగం'తో భావోద్వేగాలు, గ్రామీణ వాతావరణం, నిజాయితీతో కూడిన కథ చెప్పి ప్రేక్షకుల మనసులు గెలుచుకున్నాడు.



### ఉప్పొంగిన మూసీ.. పోచంపల్లి -బీబీనగర్ మధ్య

## రాకపోకలు బంద్

మొంథా తుఫాన్ ప్రభావంతో జంట నగరాల్లో కురుస్తున్న వర్షాల కారణంగా జూలూరు- రుద్రవెల్లిలో లెవల్ బ్రిడ్జి వద్ద బుధవారం ఉదయం మూసీ నది ఉదృతంగా ప్రవహిస్తుంది. దీంతో పోచంపల్లి- బీబీనగర్ మధ్య రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. దీంతో వాహనదారులు బీబీనగర్, భువనగిరికి వెళ్లేందుకు పెద్ద రావులపల్లి నుండి చుట్టూ తిరిగి వెళుతున్నారు. మూసీ ఉధృతితో అధికారులు ఇరు వైపులా భారీ కేడ్లు ఏర్పాటు చేశారు. అధికారులు పోలీసులు పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భారీ వర్షాలతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మూసీ పరివాహక ప్రాంతాల్లో సంచరించవద్దని మండల తాసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంఆర్ఐ గుత్తా వెంకట్ రెడ్డి సూచించారు.





## కుటుంబంలో ఒక్కటైన 'కాకి'.. నల్గొండ జిల్లాలో వింత ఘటన

కాకి.. అంటేనే అందరూ ఈసడించుకుంటారు. దాన్ని ఇంటి పరిసర ప్రాంతాల్లోకి అసలు రానివ్వరు. కానీ ఈ దంపతులు మాత్రం కాకిని చేరదీశారు. తమ సొంత బిడ్డలాగా కాకి ఆలనాపాలనా చూసుకుంటున్నారు. దేవరకొండ పట్టణానికి చెందిన షేక్ యూసుఫ్, సాఫియా కుటుంబంతో ఓ కాకి ఏడాది కాలంగా కలిసి ఉంటున్నది. ఉదయం ఇంటికి వచ్చి, కుటుంబ సభ్యులతోనే సాయంత్రం వరకు ఉంటుందని.. కాకిని కుటుంబంలో ఒకటిగా చూసుకుంటున్నామని సాఫియా పేర్కొంది. కాకికి అన్నం, చికెన్ ఆహారంగా ఇస్తున్నామని తెలిపింది. అయితే, 2 రోజులుగా ఆహారం తీసుకోకపోవడంతో పశువుల ఆసుపత్రికి తీసుకురాగా, పరీక్షించి చికిత్స అందించారు వైద్యులు. కాకిని ప్రేమగా చూసుకుంటున్న షేక్ యూసుఫ్, సాఫియా దంపతులపై ప్రశంసల వర్షం కురుస్తుంది. అందరూ ఈసడించుకునే కాకిని చేరదీసి, దాని ఆలనాపాలనా చూసుకోవడం గొప్ప విషయమని కొనియాడుతున్నారు. అంతేకాకుండా దానికి ఆహారాన్ని అందించడం.. పక్షుల పట్లవారికున్న ప్రేమను చూపిస్తుందని పేర్కొంటున్నారు.

### రూల్స్ పాటించలేదని.. పోలీసులకే

## చుక్కలు చూపించిన ఓ యువకుడు

సాధారణంగా రోడ్లపై ఎక్కడైనా ట్రాఫిక్ పోలీసులు కనిపిస్తే వారి నుంచి తప్పించుకోవడానికి వాహనదారులు తమ బైక్ లను వెనక్కి తిప్పి అక్కడి నుంచి జారుకుంటుంటారు. ఇలాంటి వీడియోలు ఎన్నో మనకు నిత్యం సోషల్ మీడియాలో కనిపిస్తుంటాయి. అలాంటి వీడియోల్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుంటాయి. ఇక వీటికి వచ్చే కామెంట్లు, రియాక్షన్లు ఎంతో ఫన్నీగా ఉండడంతో పాటు ఆలోచింపజేస్తుంటాయి. కానీ ముంబైలో ఓ విద్యార్థి పోలీసులకే చుక్కలు చూపించాడు.హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేసినందుకు జరిమానా విధించడంతో ఆగ్రహించిన విద్యార్థి ట్రాఫిక్ పోలీసులపై విరుచుకుపడ్డాడు. 'పోలీసులే నియమాలు ఉల్లంఘిస్తున్నారు' అంటూ వారిని వెంబడించి వీడియో తీశాడు. ఈ ఘటన మహారాష్ట్రలోని థానే వెస్ట్ ప్రాంతంలో చోటుచేసుకుంది. నంబర్ ప్లేట్ స్పష్టంగా లేదని.. ఇద్దరు ట్రాఫిక్ పోలీసులు నడిపిన స్కూటర్ నంబర్‌ప్లేట్ స్పష్టంగా కనపడలేదని ఆరోపించిన ఓ విద్యార్థి, తన స్నేహితుడితో కలిసి వారిని వెంబడించాడు. వీడియోలో పోలీసులు నడిపిన స్కూటర్ వెనుక కూర్చున్న అధికారి హెల్మెట్ లేకుండా కనిపించడం మరో ఆసక్తికర అంశంగా మారింది. ఆ సమయంలో యువకుడు స్కూటర్ వెనుకకు చేరి హ్యాండిల్ పట్టుకునే ప్రయత్నం చేయడం కూడా వీడియోలో స్పష్టంగా రికార్డయింది. అతను "నంబర్‌ప్లేట్ కనపడడం లేదు" అని ప్రశ్నించగా, ఒక పోలీస్ అధికారి "ఇది మా వాహనం కాదు, స్వాధీనం చేసుకోవడానికి తీసుకొచ్చాం" అని సమాధానమిచ్చారు. దానికి యువకుడు "సీజ్ చేయాల్సిన వాహనాన్ని మీరు ఎలా నడుపుతున్నారు?" అంటూ ప్రతివాదించాడు. ఈ వీడియో ఇంటర్నెట్‌లో వైరల్ కావడంతో పెద్ద చర్చ మొదలైంది. స్పందించిన పోలీసులు వైరల్ వీడియోపై స్పందించిన థానే పోలీసులు, "వీడియోలో కనిపించిన



యువకుల్లో ఒకరు హెల్మెట్ లేకుండా బైక్ నడిపినందుకు చర్య తీసుకున్నాం. ఆ చర్యపై అసంతృప్తితో యువకులు వాదనకు దిగారు. స్వాధీనం చేసుకున్న వాహనానికి సంబంధించిన నంబర్‌ప్లేట్ సమస్యపై చర్య తీసుకున్నాం" అని ఎక్స్ ట్విట్టర్)లో వెల్లడించారు.

**ప్రశ్నించడమే కాదు.. నిబంధనలూ పాటించాలి**

ఈ ఘటన మరొకసారి సామాజిక మాధ్యమాల ప్రభావాన్ని గుర్తు చేసింది. చట్ట ఉల్లంఘనపై ప్రజలు ప్రశ్నించడం మంచిదే కానీ, అదే సమయంలో నియమాలను పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. హెల్మెట్ లేకుండా డ్రైవ్ చేస్తూ పోలీసులు తప్పు చేస్తున్నారని వీడియో తీయడం కన్నా, ముందుగా మనం సురక్షితంగా ఉండటమే ముఖ్యం. ప్రస్తుత సమయంలో అధికారులతో వాదనకు దిగే ముందు 'నిబంధనల పాటింపున'కే ప్రాధాన్యం ఇవ్వాలి.



### ఖమ్మం జిల్లాలో భారీ వర్షాలు..

## విద్యాసంస్థలకు సెలవు

మొంథా తుపాను ప్రభావంతో ఖమ్మం జిల్లా వ్యాప్తంగా వానలు దంచికొడుతున్నాయి. తేలికపాటి నుంచి మోస్తరు, భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో జిల్లా అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఖమ్మం, పాలేరు, వైరా, మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో వర్షం కురుస్తుంది. ఈ క్రమంలో జిల్లాలోని అన్ని విద్యాసంస్థలకు కలెక్టర్ సెలవు ప్రకటించారు. మరో వైపు పాలేరు జలాశయానికి భారీగా వరద నీరు వచ్చి చేరుతుంది. దీంతో 23 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేశారు. దిగువ ప్రాంతాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఇక అశ్వరావుపేటలో చల్లని గాలులు వీస్తుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM








# భయపెడుతున్న మొంథా తుఫాన్

## ఒంగోలులో ఈదురుగాలులతో కూడిన వర్షం

రెండు తెలుగు రాష్ట్రాల్లో మొంథా తుఫాను బీభత్సం సృష్టిస్తోంది. ముఖ్యంగా కోస్తా జిల్లాల్లో దీని ప్రభావం అధికంగా ఉంది. అర్ధరాత్రి 11:30 నుండి 12:30 గంటల మధ్య నరసాపూర్ సమీపంలో తీరం దాటిన తుఫాను కారణంగా సముద్రం అల్లకల్లోలంగా మారింది. అలలు భారీగా ఎగసిపడు తున్నాయి. ఈదురుగాలులు కూడా భారీగా వీస్తున్నాయి. అయితే, కొన్ని గంటల్లో ఇది తీవ్ర వాయుగుండంగా మారి బలహీనపడనుంది.




# రూ.900 కోట్ల హీరోయిన్.. శ్రద్ధా కపూర్

సాధారణంగా హీరోలు, హీరోయిన్లు విలాసవంతమైన జీవితాన్ని గడుపుతారు. ఇక వారు ధరించే దుస్తులు, వారు నడిపే కార్లు, వారు కలిగి ఉన్న బంగ్లాలు అన్నీ చాలా ఖరీదైనవి. సెలబ్రిటీలు ఉపయోగించే ఒకే ఒక్క వాచ్ ధరతో సామాన్యుడు ధనిక జీవితాన్ని గడపవచ్చు. అయితే, కొంతమంది ధనిక జీవితాన్ని ఆస్వాదిస్తారు. అలాగే కొందరు తమ సింపుల్ లైఫ్ స్టైల్ తో అందరి దృష్టిని ఆకర్షిస్తుంటారు. ఇప్పుడు ఒక నటి అందరి హృదయాలను గెలుచుకుంది. కోట్ల ఆస్తులు.. లంబోర్గిని కారు ఉన్నప్పటికీ ఆమె ఇప్పుడు చిన్న స్విఫ్ట్ కారులో తిరగడం చూసి అభిమానులు ఆశ్చర్యపోతున్నారు. ఆమె మరెవరో కాదు.. శ్రద్ధా కపూర్. ఇటీవల కల్కి దర్శకుడు నాగ్ అశ్విన్ చిన్న కారు వాడుతున్నాడని వార్తలు వచ్చాయి. వెయ్యి కోట్లు వసూలు చేసిన చిత్రానికి దర్శకుడు అయినప్పటికీ చిన్న కారులో తిరగడం చూసి షాకయ్యారు.

# నవంబర్ 2న సీఎంఎస్-03 ఉపగ్రహ ప్రయోగానికి ఇస్రో సన్నాహాలు

భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ మరో ప్రతిష్ఠాత్మక ప్రయోగానికి సిద్ధమైంది. దేశంలోనే అత్యంత బరువైన కమ్యూనికేషన్ ఉపగ్రహం సీఎంఎస్-03 ను నవంబర్ 2న నింగిలోకి పంపేందుకు సన్నాహాలు పూర్తి చేసింది. భారత నౌకాదళం కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఈ శాటిలైట్‌ను ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ప్రయోగించనున్నారు. దేశంలోనే అత్యంత శక్తిమంతమైన లాంచ్ వెహికల్ మార్క్ 3 రాకెట్ ఈ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి మోసుకెళ్లనుంది.సీఎంఎస్-03 ఉపగ్రహాన్ని జీశాట్-7ఆర్ అని కూడా పిలుస్తారు. ఇది పూర్తిగా సైనిక అవసరాల కోసం ఉద్దేశించిన మల్టీ-బ్యాండ్ కమ్యూనికేషన్ ఉపగ్రహం. దీని బరువు సుమారు 4,400 కిలోలు. భారత భూభాగం నుంచి భూస్థిర బదిలీ కక్ష్య లోకి ప్రయోగించనున్న అత్యంత బరువైన కమ్యూనికేషన్ శాటిలైట్ ఇదే కావడం విశేషం. "భారత భూభాగంతో పాటు విస్తారమైన సముద్ర జలాల్లో ఈ ఉపగ్రహం సేవలు అందిస్తుంది" అని ఇస్రో ఒక ప్రకటనలో పేర్కొంది.2013లో ప్రయోగించిన జీశాట్-7 రుక్మిణి ఉపగ్రహం స్థానంలో జీశాట్-7ఆర్ సేవలు అందించనుంది. అత్యాధునిక పేలోడ్స్‌తో రూపొందించిన ఈ ఉపగ్రహం.. హిందూ మహాసముద్రంతో పాటు ఇతర కీలక సముద్ర ప్రాంతాల్లో నౌకాదళ కార్యకలాపాల సామర్థ్యాన్ని గణనీయంగా పెంచనుంది. దీని ద్వారా వాయిస్, డేటా, వీడియో లింక్‌ల కోసం సి, ఎక్స్‌టెండెడ్ సి, క్యూ-బ్యాండ్లలో సురక్షితమైన కమ్యూనికేషన్ సేవలు అందుబాటులోకి వస్తాయి. ఇది సైనిక అవసరాలతో పాటు మారుమూల ప్రాంతాల్లోని పౌర



ఏజెన్సీలకు కూడా మెరుగైన డిజిటల్ సేవలు అందించడంలో సహాయపడుతుంది.ఇప్పటికే ఉపగ్రహాన్ని రాకెట్‌తో అనుసంధానం చేసి అక్టోబర్ 26న ప్రయోగ వేదికపైకి తరలించినట్లు ఇస్రో వెల్లడించింది. చంద్రయాన్-3 మిషన్‌ను విజయవంతంగా మోసుకెళ్లిన ఎల్వీఎం3 రాకెట్‌కు ఇది ఐదో కార్యాచరణ ప్రయోగం కానుంది.ఇదే క్రమంలో ఈ ఏడాది చివరి నాటికి మరో భారీ విదేశీ ఉపగ్రహాన్ని ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ డాక్టర్ వి. నారాయణన్ గత వారం ప్రకటించారు. అమెరికాకు చెందిన ఏఎస్‌టీ స్పేస్‌మొబైల్ అభివృద్ధి చేసిన 6.5 టన్నుల బరువున్న బ్లూబర్డ్-6 ఉపగ్రహాన్ని కూడా ఎల్వీఎం3 రాకెట్ ద్వారానే శ్రీహరికోట నుంచి ప్రయోగించనున్నట్లు ఆయన తెలిపారు. "బ్లూబర్డ్ శాటిలైట్‌ను ప్రయోగించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. సరైన సమయంలో ప్రధాని దీని తేదీని ప్రకటిస్తారు" అని నారాయణన్ ఓ మీడియా సమావేశంలో వెల్లడించారు.

# రైతులను ఆదుకోవడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని డిమాండ్



తమిళగ వెట్రి కళగం అధినేత విజయ్తమిళనాడులోని డీఎంకే ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కావేరి డెల్టా ప్రాంతంలో ధాన్యం కొనుగోళ్లు, వరద నష్టాల విషయంలో ముఖ్యమంత్రి ఎం.కే. స్టాలిన్ సర్కార్ పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు. రైతుల జీవితాల పట్ల ఉదాసీనత చూపుతూ వారిని మోసం చేస్తోందని మంగళవారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తీవ్రంగా ధ్వజమెత్తారు.డెల్టా ప్రాంతాన్ని ముంచెత్తుతున్న ఎడతెరిపిలేని వర్షాలు వరి పంటలను నాశనం చేయడమే కాకుండా, డీఎంకే ప్రభుత్వ అసమర్థతను, నిర్లక్ష్యాన్ని బట్టబయలు చేశాయని విజయ్ అన్నారు. నీటికి నాని మొలకెత్తిన ధాన్యం గింజల్లాగే, డీఎంకే ప్రజా వ్యతిరేక పాలనపై ప్రజల్లో నిరసన కూడా మొలకెత్తి, పెరిగి, ఈ ప్రభుత్వాన్ని ఇంటికి పంపిస్తుంది" అని ఆయన హెచ్చరించారు.కురుస్తున్న వర్షాల నుంచి మిగిలిన ధాన్యం నిల్వలను కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు తక్షణ చర్యలు తీసుకోలేకపోయిందని విజయ్ ప్రశ్నించారు. "రైతులపై నిజంగా శ్రద్ధ ఉన్న ప్రభుత్వం వారి జీవనోపాధిని కాపాడటానికి, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి సహాయపడుతుంది. కానీ ఈ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేస్తూ, రైతులు కష్టపడి పండించిన పంట వర్షానికి కుళ్లిపోయేలా చేసి పేద రైతులను అణిచివేస్తోంది" అని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపైనే ఆధారపడి జీవిస్తున్న పేద రైతులకు సకాలంలో కొనుగోళ్లు, గిట్టుబాటు ధర లభించే వ్యవస్థ ఉండాలని విజయ్ నొక్కి చెప్పారు. "ప్రతి ఏటా ఇదే దయనీయ పరిస్థితి పునరావృతమవుతోంది. రైతులు తమ పంటను అమ్ముకొని సంపాదించుకోకుండా స్టాలిన్ ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా అడ్డుకుంటుందా" అని ఆయన నిలదీశారు.డెల్టా ప్రాంత ప్రయోజనాలకు తామే కాపలాదారులమని డీఎంకే చెప్పుకోవడాన్ని విజయ్ ఎద్దేవా చేశారు. "స్టాలిన్ తాను డెల్టా బిడ్డనని గొప్పలు చెప్పుకుంటారు, కానీ ఏటా రైతుల పంటలు వర్షాలకు నాశనమవుతుంటే ప్రభుత్వం చూస్తూ ఊరుకుంటోంది. ఇలాంటి నష్టాలను నివారించడానికి ముందస్తు చర్యలు ఉండక్కర్లేదా పండించిన ధాన్యాన్ని కాపాడటానికి నిల్వ సౌకర్యాలు మెరుగుపరచవద్దా అని ఆయన ప్రశ్నల వర్షం కురిపించారు.నిల్వ ఉంచిన బస్తాల్లోనే ధాన్యం మొలకెత్తినట్లే, డీఎంకేపై ప్రజా వ్యతిరేకత కూడా ప్రజల మనసుల్లో మొలకెత్తడం ప్రారంభమైందని, ఈ అసంతృప్తి త్వరలోనే బలపడి ప్రజా వ్యతిరేక పాలకులను ఇంటికి పంపిస్తుందని విజయ్ అన్నారు. రైతు వ్యతిరేక కార్యకలాపాలను తక్షణమే నిలిపివేసి, ఈశాన్య రుతుపవనాల నేపథ్యంలో పంటలను, ప్రజలను కాపాడటానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అప్పులు, లోన్లు తీసుకుని స్నేహితుల మోసం.. మత్తు ఇంజక్షన్లు తీసుకుని డాక్టర్ బలన్మరణం..

స్నేహితులు తీసుకున్న అప్పు తిరిగి ఇవ్వడం లేదని ఓ డాక్టర్ మానసిక ఆవేదనకు గురయ్యాడు. ఎన్నిసార్లు అడిగినా స్నేహితుల నుంచి సరైన స్పందన రాలేదు. అప్పులు మరింత పెరిగిపోయాయి.. చివరకు అప్పులు తీర్చలేమన్న బాధతో.. ఇంజక్షన్లు చేసుకుని.. డాక్టర్ ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. కరీంనగర్ జిల్లా నగునూరులోని ప్రతిమ వైద్య కళాశాలలో అనస్థీషియా పీజీ రెండో సంవత్సరం చదువుతున్న ఎంపటి శ్రీనివాస్ (42) అనే వైద్యుడు నుంచి.. కరీంనగర్ ప్రాంతానికి చెందిన వింజనురి కరుణాకర్ రూ.1.50 కోట్లు, కిరణ్, కవిత, వెంకట నరహరి అనే ముగ్గురు స్నేహితులు రూ.1.35 కోట్లు బ్యాంకు రుణం, బంజేరుపల్లికి చెందిన కుమారస్వామి తన వ్యాపారం కోసం రూ.28 లక్షలు అప్పుగా తీసుకున్నారు. ఈ డబ్బులు తిరిగి చెల్లించడం లేదు. ఎన్నో సార్లు అడిగిన సరైన సమాధానం చెప్పడం లేదు. అంతేకాకుండా.. శ్రీనివాస్ బ్యాంకు ఈఎంఐలు చెల్లించలేడం కష్టం గా మారింది. శ్రీనివాస్‌పై ఒత్తిడి తెచ్చిన బ్యాంకు అధికారులు.. అప్పు తీర్చాలంటూ అడిగారు. అప్పు తీసుకున్న వ్యక్తులు ఇవ్వమని అడిగితే, ఏం చేసుకుంటావో చేసుకోమని బెదిరించారు.



స్నేహితుల తీరుతో తీవ్ర మనస్తాపం చెందిన శ్రీనివాస్.. బలవన్మరణానికి పాల్పడ్డాడు.. అనస్థీషియా ఇంజక్షన్ ను మొతాదుకు మించి వేసుకున్నాడు. ఇంట్లో ఎవరు లేని సమయంలో అనస్థీషియా ఇంజక్షన్ వేసుకుని.. అపస్మారక స్థితిలోకి చేరుకున్నాడు. ఆసుపత్రికి తరలించే లోపే చనిపోయాడు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఉగాదికి డెకాయిట్




ప్రేమ, ప్రతీకారం నేపథ్యంలో అడివి శేష్ నటిస్తున్న ఇంటెన్స్ క్రైమ్ థ్రిల్లర్ 'డెకాయిట్'. మృణాళ్ ఠాకూర్ కథానాయిక. షానియల్ డియో దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మక అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మిస్తున్న ఈ చిత్రం 2026 ఉగాది కానుకగా మార్చి 19న విడుదల కానున్నది. ఈ విషయాన్ని తెలియజేస్తూ మంగళవారం మేకర్స్ ఓ ప్రకటన విడుదల చేశారు. ఈ సందర్భంలోనే అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ ఇంటెన్స్ లుక్స్‌లో కనిపిస్తున్న రిలీజ్ డేట్ పోస్టర్‌ని కూడా విడుదల చేశారు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు అందర్నీ ఆకట్టుకున్నాయని, జాతీయ స్థాయిలో సంచలనం సృష్టించే సినిమా ఇదని మేకర్స్ నమ్మకం వెలిబుచ్చారు. బాలీవుడ్ దర్శక, నటుడు అనురాగ్ కశ్యప్ కీలకపాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: భీమ్స్ సిసిరోలియో.